

భద్రాద్రిలో సహస్ర కలశాభిషేకానికి

అంకురార్పణ



స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భద్రాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో మాఘపౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి నిర్వహించే సహస్ర కలశాభిషేకానికి సోమవారం అంకురార్పణ చేశారు. స్థానిక యాగశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎటువంటి విఘ్నా లు కలుగకుండా ముందుగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం సహస్ర కలశవాహన, బుధవారం సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించే ఈ అభిషేకంతో లోకం సుభిక్షంగా ఉండటంతో పాటు ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటారు. కాగా సహస్ర కలశాభిషేకాన్ని పురస్కరించుకుని శ్రీసీతారామచంద్రస్వామికి రోజూ నిర్వహించే నిత్యకల్యాణం మంగళ, బుధవారాల్లో నిలిపివేయనున్నారు. అలాగే స్వామివారికి పవళింపు సేవలు నిర్వహించారు. ఇదిలా ఉండగా శ్రీసీతారామచంద్రసామి సోమవారం ముత్తంగి ఆలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం మూలవరులకు ముత్తంగి ఆలంకారాన్ని ధరింపజేస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామయ్యకు పునర్వసు కల్యాణం

భద్రాద్రి రామయ్యకు పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పునర్వసు కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు తీసుకురాగా ముందుగా సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 84 జంటలు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి విస్తరణలో అణుశక్తి పాత్ర ప్రశంసనీయం

- ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు చైర్మన్ దినేష్‌కుమార్ శుక్లా
- అట్టహాసంగా 39వ అణుశక్తి క్రీడలు ప్రారంభం

7



రాష్ట్ర ప్రభుత్వం త్వరలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సమాయత్త మవుతుండడంతో రాజకీయ పార్టీలు మళ్లీ ఎన్నికల పోరుకు సిద్ధమవుతున్నాయి. ప్రధాన పార్టీలు తమ కార్యకర్తలు, నాయకులను ఎన్నికల రంగానికి సమాయత్తం చేస్తున్నాయి. అందరికంటే ముందు కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల సమరానికి కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలోనే ముందుగా ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల శంఖారావం పూరించింది. ఎన్నికల కార్యాచరణలోకి దిగాలని ఖమ్మం ఎమ్మెల్యే, వ్యవసాయశాఖ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలు లేనందున జిల్లా కేంద్రంలోని కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, ఇతర సీనియర్ నాయకులను పంచాయతీలకు, ఎంపీటీసీలకు పార్టీ ఇన్‌చార్జులుగా నియమించబోతున్నారు. వీరంతా ముందుగా గ్రామాలకు వెళ్లి పరిస్థితిని గ్రహించి పార్టీపరంగా ప్రజల్లో గుర్తింపు ఉన్న నేతలను అభ్యర్థులుగా బరిలో దించేందుకు సర్వే చేస్తారు. ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతున్నందున ఇటు వార్డు సభ్యులు, సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు పార్టీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.



'స్థానిక' దూకుడు

పల్లెపోరుకు ముందస్తు సన్నాహాల్లో పార్టీలు

- నియోజకవర్గ సమీక్షలు నిర్వహిస్తున్న కాంగ్రెస్
- గ్రామాల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకానికి కసరత్తు
- తామూ తగ్గేదే లేదంటున్న విపక్షాలు
- సత్తాచాటాలని బీఆర్ఎస్ ఎత్తులు
- పంచాయతీ, పరిషత్ ఎన్నికలు ఒకేసారి నిర్వహించే యోచనలో సర్కార్

ఖమ్మం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పార్టీలో ఉన్న వర్గాల కారణంగా వేరే పార్టీలతో కొందరు సంబంధాలు పెట్టుకుని పార్టీకి నష్టం చేసే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సన్నాహక సమావేశంలో ప్రస్తావించిన నేపథ్యంలో ఆ దిశగా కూడా పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోని వర్గాలను దృష్టిలో ఉంచుకుని ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యర్థి వర్గం అభ్యర్థిని దెబ్బతీసేందుకు వ్యక్తిగత అజెండాతో వెళ్లవద్దని, అలాంటివారిని పార్టీ నుంచి బయటకు పంపుతామని హెచ్చరికలు జారీ చేయడం కాంగ్రెస్ కేడర్‌లో చర్చనీయాంశంగా మారింది. గతంలో చూసీచూడనట్టుగా వ్యవహరించినా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎన్నికల్లో క్రాస్‌ఓటింగ్, ప్రత్యర్థి పార్టీలతో కుమ్మక్కులు వంటివాటిపై నిఘా పెట్టనుంది. మొత్తం మీద ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రచారం చేసుకుంటూనే గతేడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన పనులను కూడా ప్రజలకు వివరిస్తూ స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది.

స్థానిక పోరుకు సై అంటున్న విపక్షాలు

విపక్షపార్టీలు కూడా స్థానిక ఎన్నికలకు సై అంటున్నాయి. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా బీఆర్ఎస్ నేతలు గ్రామాల్లో శుభకార్యాలకు హాజరవుతూ పరామర్శలు, పలకరింపులతో ప్రజలకు దగ్గరయ్యే పనిలో పడ్డారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఓటమి తర్వాత కొంత స్తబ్ధుగా ఉన్న కారు పార్టీ మళ్లీ స్థానిక ఎన్నికల ద్వారా ప్రజలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. కాంగ్రెస్‌లోని వర్గ విభేదాలను తమకు అనుకూలంగా మలచుకుని ఎన్నికల బరిలో సత్తా చాటేందుకు ఆ పార్టీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు. కాంగ్రెస్ తన మిత్రపక్షమైన సీపీఐతో అవగాహన కుదిరిన కలిసి పోటీ చేస్తూ లేనిపక్షంలో ఇతర పక్షాలతో కూడా స్థానికంగా జతకట్టే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా కార్యవర్గ సమావేశాల్లో స్థానిక ఎన్నికలపై సీపీఐ నేతలు చర్చించారు. పొత్తుల విషయం ముందే తేల్చకుండా స్నేహపూర్వక సీట్లను దృష్టిలో ఉంచుకుని సీపీఐ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సీపీఎం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా తర్వాత కాంగ్రెస్‌తో జతకట్టినా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంకా వైఖరి స్పష్టం చేయలేదు. పొత్తులు మండల స్థాయిలో ఉండాలా జిల్లాస్థాయిలో ఉండాలనేదానిపై అంతర్గత చర్చ జరుగుతోంది. బీజేపీ, టీడీపీలు కూడా స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు ఉత్సాహం చూపుతున్నాయి. మొత్తం మీద స్థానిక ఎన్నికల సమరం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో పార్టీలు సమర సన్నాహాలు చేస్తున్నాయి.



ప్రింటింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, పక్కన జడ్పీ సీఈవో దీక్షరైనా, డీపీవో ఆశాలత

పరిషత్ ఎన్నికలకు కసరత్తు

- ఖమ్మం జిల్లాలో 8,22,528 మంది ఓటర్లు
- జాబితా విడుదల చేసిన అధికారులు

6

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 4089

- తుది ఓటరు జాబితా విడుదల చేసిన అధికారులు
- ఖమ్మం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు
- 108 మంది పోలింగ్ సిబ్బంది
- 27న పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లలో అధికారులు



ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉపాధ్యాయ ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. జిల్లాలో మొత్తం 4,089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. జిల్లాలోని 20 మండలాల్లో 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సెక్టోరియల్ అధికారుల నియామకం పూర్తి చేశారు.

24 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 20 మండలాల్లోనూ 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి మండలానికి ఒకటి చొప్పన పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఖమ్మంలో మాత్రం నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 4089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,372, మహిళలు 1,717 మంది ఉన్నారు. ఖమ్మంలో 1,986మంది ఓటర్లు అత్యధికంగా ఉన్నారు.

108 మంది పోలింగ్ సిబ్బంది

ఎమ్మెల్సీ పోలింగ్ కోసం 108మంది పోలింగ్ సిబ్బందిని వినియోగించనున్నారు. సెక్టోరియల్ అధికారులతో పాటు 27మంది ప్రిసైడింగ్ అధికారులు, 27మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 53మంది పోలింగ్ సహాయకులను వినియోగించనున్నారు. వీరితో పాటు 28 మంది మైక్రోఅబ్జర్వర్లు నియమించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పెట్టెలను ఇప్పటికే జిల్లాకు చేర్చారు. ఎస్సార్‌బీజీఎన్నార్ కళాశాల స్ట్రాంగ్ రూంలో వీటిని భద్రపరిచారు. 140 బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా ఉంచినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 27న పోలింగ్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అనంతరం నల్గొండలో ఓట్ల లెక్కింపును మార్చి 3న నిర్వహించనున్నారు.

ఇద్దరు బాలికల కిడ్నాప్

24గంటల్లో ఛేదించిన పోలీసులు

7

ఎంఆర్ఐ సేవలు ఎప్పుడో..!

- ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో లేని ఎంఆర్ఐ
- అత్యవసర సమయంలో క్షతగాత్రుల ఇక్కట్లు

6



తునికాకు సేకరణ ఎప్పుడు?

- ఏజెన్సీ ప్రాంతాల్లో వేసవి ఉపాధిగా ఆకు సేకరణ
- తునికాకు సేకరణ పనుల కోసం గిరిజనుల ఎదురు చూపులు
- వెంటనే టెండర్లను పూర్తి చేయాలని డిమాండ్

కొత్తగూడెం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవులు, గుట్టలు అటవీ ప్రాంతాల్లో వేసవికాలంలో తునికాకు సేకరణ గిరిజన, గిరిజనేతరులకు ముఖ్యమైన ఉపాధి అవకాశం.. తునికాకు సేకరణ కోసం ఏజెన్సీ వాసులు ఇప్పటికే ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి ప్రతి ఏడాది ఫిబ్రవరిలోనే తునికాకు సేకరణ పనులు ప్రారంభం కావాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ ఇటు అటవీశాఖాధికారులు కానీ తునికాకు సేకరణ పనులను ప్రారంభించలేదు. వెంటనే తునికాకు (మిగతా 6వ పేజీలో)

బయట విందు..

లోపల మందు

- ఫ్యామిలీ దాబాల పేరుతో బోర్డులు..
- లోపల బార్ తరహాలో మద్యం సరఫరా
- నేరుగా వైన్ షాపుల నుంచే విక్రయాలు
- మామూళ్ల మత్తులో తనిఖీలు మరిచిన పోలీసులు?
- ఖమ్మం నగర శివార్లలో యథేచ్ఛగా దందా



ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర శివార్లలోని దాబాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. కేవలం ఆహారపదార్థాలు మాత్రమే విక్రయించేందుకు అనుమతులు తీసుకుని వాటికి విరుద్ధంగా కొందరు దాబాల యజమానులు అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. హైవేలు, ప్రధాన రహదారుల పక్కన దాబాలు నిర్వహిస్తుండటంతో అర్ధరాత్రి వేళల్లో సైతం ఓపెన్ ఉండటంతో లారీలు రోడ్డు పక్కనే ఇష్టారీతిన నిలుపుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోలింగ్ పోలీసులు రాత్రి సమయాల్లో హైవేల పక్కనున్న దాబాల్లో నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి వెళుతున్నారు. వారు వచ్చిన సమయంలో వెంటనే లైట్లు ఆపి, వారు వెళ్లినవెంటనే దాబాల యజమానులు సిబ్బందితో మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. మద్యం సరఫరాకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుంటున్నట్లు సమాచారం.

పేరుకే ఫ్యామిలీ దాబాలు

నగర శివార్లలో చాలా దాబాలకు బయట బోర్డులు మాత్రం ఫ్యామిలీ దాబాలు అని పెట్టి లోపల అంతా బార్ల మాదిరిగా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. దాబాకు వచ్చేవారు మద్యం బయటనుంచే తెచ్చుకోవాలని అక్కడి సిబ్బంది నేరుగా చెబుతున్నారు. దీంతో తినేందుకు వచ్చిన వారు మద్యం తీసుకుని అక్కడే సేవిస్తున్నారు. ఒకవేళ మద్యం (మిగతా 6వ పేజీలో)

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

» ఐటీడీఏ పీవో బి.రాహుల్



కంప్యూటర్లను పరిశీలిస్తున్న పీవో

భద్రాచలం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకునే బాలబాలికలకు చదువుతో పాటు కంప్యూటర్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం పీఎంఆర్సీ భవనంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలకు సరాఫరా చేయడానికి కొనుగోలు చేసిన కంప్యూటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు కంప్యూటర్ ద్వారా వారి మేధా శక్తిని పెంపొందించుకోవడానికి ఐదవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా ప్రత్యేక ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను సందర్శించారు. కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు రాజేష్, శేఖర్, రామ్‌కుమార్, మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి, క్రాఫ్ట్ టీచర్లు బేబీ సునంద, సరస్వతి, రాంబాబు, మూర్తి, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలని ధర్నా

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తామంతా శాంతియుతంగా ధర్నా చేస్తాం.. తమకు పునరావాసం కల్పించాలంటూ ఆ గ్రామస్థులు రోడ్డెక్కిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని అంబేడ్కర్ నగర్ ఎదుట జాతీయ రహదారిపై గ్రామస్థులు వందలాది మంది ప్లకార్డులతో చేరుకుని రాస్తారోకో చేశారు.

ఆ గ్రామంలో సుమారు 500కుటుంబాలు నివసిస్తుండగా సింగరేణి రాకతో తమ గ్రామం అభివృద్ధి మాట దేవుడెరుగు సమస్యల కుప్పగా మారిందంటూ కన్నీళ్లపర్యంతమయ్యారు. అంబేడ్కర్‌నగర్‌కు ఆనుకొని సింగరేణి సంస్థ రూ.400కోట్లతో రైలు భోగీలలో బొగ్గు నింపే సైలోబంకర్‌ను నిర్మించారు. అప్పటి నుంచి సమస్య అంతా గ్రామానికి బొగ్గు మసి, దుమ్మూధూళీ రూపంలో చుట్టుముట్టింది. పలువురు అనారోగ్య సమస్యలతో మంచాన పడుతుండగా ఇంకొందరు మృత్యువాత పడుతున్నారని, ఇందుకు కారణమైన సైలో బంకర్‌ను తొలగించాలని, లేకుంటే తమకు పునరావాసం కల్పించాలని గ్రామస్థులు పలుమార్లు ఆందోళన చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినప్పటికీ తమకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, కంటితుడుపు చర్యలే మిగిలాయని, ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అని గ్రామస్థులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిబిరాన్ని సందర్శించిన పీవోలు

శాంతియుతంగా ధర్నా చేస్తున్న శిబిరాన్ని జేవీఆర్, కిష్టారం ఓసీ పీవోలు ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావులు మాట్లాడుతూ కిష్టారం సమస్యను గతంలోనూ.. తాజాగా ఉన్నతాధికారులకు వివరించామని, పరిష్కార మార్గాలను వెంటనే అమలు చేసేందుకు కృషి చేస్తామని, అప్పటి ధర్నాను నిలిపివేయాలంటూ పీవోలు గ్రామస్థులను కోరారు. తమకు పరిష్కారం వెంటనే కనిపిస్తేనే ధర్నా ఆపుతామని, లేకుంటే కొనసాగిస్తామంటూ గ్రామస్థులు భీష్మించకు కూర్చున్నారు.



కిష్టారంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఎంఆర్ఐ సేవలు ఎప్పుడో..!

» ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో లేని ఎంఆర్ఐ » అత్యవసర సమయంలో క్షతగాత్రుల ఇక్కట్లు



ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిని మెడికల్ కళాశాలకు అనుసంధానం చేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగుతుందని అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయనుకున్న జిల్లా ప్రజలకు ఆశానిరాశగానే మారింది. గతంలో వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడే యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ సేవలు అందుబాటులో ఉండేవి, కానీ మెడికల్ కళాశాల అయిన తర్వాత ఈ సేవలన్నీ మూలనపడ్డాయి. అంతే కాదు పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో ఆశించిన వైద్యం అందడం లేదు. కొన్ని విభాగాల్లో ఆధునికయంత్ర పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ అత్యవసరమైన ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి తీసుకురావడాన్ని విస్మరించారు. ఎంతో విలువైన అత్యవసరమైన ఈ పరికరాన్ని ఏళ్ల తరబడి ఇదుగో అదుగో అంటున్నా కార్యరూపం మాత్రం దాల్చడం లేదు. దీంతో బాధితులను ఈ పరీక్షల కోసం ఇతర ప్రాంతాలకు, ప్రైవేటుకు రిఫర్ చేయాల్సిన దుస్థితి వస్తోంది.

- జిల్లా ఆస్పత్రిలో ఎంఆర్ఐ సౌకర్యం లేకపోవటంతో బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి ప్రతి నిత్యం కనీసం 20 వరకు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులు వస్తుంటారు. వీరికి అవసరమైన సీటీ స్కానింగ్ అందుబాటులో ఉన్నప్పటికీ రేడియాలజిస్టులు లేక ఆపసోపాలు పడుతోంది. అయితే తలకు తీవ్రగాయాల పాలై గాయపడిన క్షతగాత్రులను పరీక్షించేందుకు ఎంఆర్ఐ అవసరం ఉంటుంది. ఈ సౌకర్యం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో ఇదివరకు మాదిరిగానే హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు రిఫర్ చేయాల్సి వస్తోంది.

ఇటీవల సత్తుపల్లికి పట్టణానికి చెందిన ఒక బాధితునికి మెదడులో లోపం ఏర్పడి అచేతనావస్థకు చేరుకున్నారు. వెంటనే ఎక్స్‌రే తీయించారు. అందులో స్పష్టత లేకపోవడంతో సీటీ స్కాన్ చేశారు. ఇందులోనూ సమస్య అస్పష్టంగా కనిపించడంతో ఎంఆర్ఐ విధిగా చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే జిల్లా ఆస్పత్రిలో ఆ సౌకర్యం అందుబాటులో లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. కొన్ని సందర్భాల్లో బాధితులకు 24 గంటల పాటు నిపుణుల పర్యవేక్షణ అవసరం అవుతుంది. కానీ వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో షరా మామూలుగా వారిని ఇతర ప్రాంతాలకు పంపాల్సి వస్తోంది. ప్రమాదాల బారిన పడ్డ వారు, మెదడుకు సంబంధించిన ఇబ్బందులు ఉన్న బాధితులస్పష్టమైన వివరాలు తెలియలాంటే ఎంఆర్ఐ చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లా ఆస్పత్రిలో ఆ యంత్రం అందుబాటులో లేదు. దీంతో బాధితులు ఈ పరీక్ష కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు జిల్లాకు చెందిన మంత్రులు దృష్టి సారించి ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి ఎంఆర్ఐ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



● డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

జిల్లా ఆసుపత్రిలో ఎంఆర్ లేకపోవటం ఇబ్బందిగానే ఉంది. ఈ యంత్రం కోసం ఇప్పటికే పలుమార్లు ప్ర భుత్వం నుంచి ప్రతిపాదనలు పంపించాలని కోరడంతో నివేదికలను పంపించాం. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. ప్రతి నిత్యం సీటీ స్కానింగ్‌లు 40 నుంచి 50వరకు తీస్తున్నాం. ఎంఆర్ఐ కూడా ఉంటే అత్యవసర రోగులకు ప్రయోజనకరంగానే ఉంటుంది.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

» ఆర్‌జేడీ ఝాన్సీ



మధిర మండలంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ ఝాన్సీ

బోనకల్/మధిర రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆర్‌జేడీ ఝాన్సీ తనిఖీ చేశారు. బోనకల్ మండలంలోని రావినూతల, మధిర రూరల్ మండలంలోని కృష్ణాపురం, దెందుకూరు, ఖమ్మంపాడు, తర్లపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. వరంగల్ అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయా? లేవా? అన్న సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నమోదు, పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బాల త్రిపుర సుందరి, ఏసీడీపీవో కృష్ణశ్రీ, సూపర్‌వైజర్లు సుజాత, జ్యోతి తదితరులున్నారు.

ముమ్మరంగా రేషన్‌కార్డుల డేటా ఎంట్రీ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో నూతనంగా ప్రజలు అందించిన రేషన్‌కార్డులను యుద్ధప్రాతిపదికన ఆన్‌లైన్ చేసేందుకు అధికారయంత్రంగాం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కేఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీజ ఖమ్మం నగర పాలక సంస్థ, అధికారులు, ఖమ్మం అర్బన్ రెవెన్యూ అధికారులను సంయుక్తంగా కార్యచరణ చేశారు. ఖమ్మంనగరంలో ఆదాయ వసూళ్లలో ఉన్న వార్డు ఆఫీసర్లను కేఎంసీకి పిలిపించి రేషన్‌కార్డుల ఆన్‌లైన్‌కు శ్రీకారం చుట్టారు.

ఖమ్మం నగర పాలక సంస్థలోని 60 డివిజన్లలో జనవరి 21 నుంచి 23 వరకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలను గ్రామ సభలు ప్రకటించి, గ్రామ సభల వేదికగా నోటీసు బోర్డులపై అతికించి బహిర్గతపరిచారు. గ్రామ సభలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పేర్లు రాని ప్రజలు మరోసారి దరఖాస్తులు చేశారు.

24గంటల్లో ఆన్‌లైన్ పూర్తి చేసేందుకు శ్రీకారం

ప్రజాపాలన గ్రామ సభలు సందర్భంగా 6,200 దరఖాస్తులు రేషన్‌కార్డుల కోసం ప్రజలు అందించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి, రోజు వారీగా కార్పొరేటర్లు అందించే రేషన్‌కార్డుల దరఖాస్తులు మరో 800 వరకు ఉన్నాయి. దీంతో 7వేల దరఖాస్తులను 24 గంటల్లో ఆన్‌లైన్ చేసేందుకు స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజ కార్యచరణ చేశారు. కేఎంసీలోని 20 మంది వార్డు ఆఫీసర్లు, 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లతో సోమవారం మధ్యాహ్నం నుంచే రేషన్‌కార్డుల ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు. రేషన్‌కార్డుల దరఖాస్తులు ఆన్‌లైన్ సందర్భంగా రెవెన్యూ సంబంధిత తప్పిదాలకు తావు లేకుండా ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవితో పాటుగా ఇతర రెవెన్యూ అధికారులను కేఎంసీకి పిలిపించి ఆన్‌లైన్ కార్యక్రమం చేపట్టారు.



అధికారులతో మాట్లాడుతున్న శ్రీజ

వైరా ఆయకట్టులో వారబంది షెడ్యూల్ విడుదల

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆయకట్టులో రబీ సాగుకు సంబంధించి నీటి సరఫరా వారబందీ షెడ్యూల్‌ను సోమవారం నీటిపారుదలశాఖ ఎస్‌ఈ మంగళంపుడి వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఈనెల 13నుంచి ఏప్రిల్ పదోతేదీ వరకు ఈ వారబందీ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

- ఈనెల 13నుంచి 18వతేదీ వరకు నీటి సరఫరా బంద్
- ఈనెల 19నుంచి 26వతేదీ వరకు నీటి సరఫరా
- ఈనెల 27నుంచి మార్చి 4వరకు నీటి సరఫరా బంద్
- మార్చి 5నుంచి 12వతేదీ వరకు నీటి సరఫరా
- మార్చి 13నుంచి 18వతేదీ వరకు నీటి సరఫరా బంద్
- మార్చి 19నుంచి 26వతేదీ వరకు నీటి సరఫరా
- మార్చి 27నుంచి ఏప్రిల్ ఒకటోతేదీ వరకు నీటి సరఫరా బంద్
- ఏప్రిల్ 2నుంచి 10వతేదీ వరకు నీటి సరఫరా
- ఏప్రిల్ 1నుంచి వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు వైరా కాల్వల మరమ్మతుల దృష్ట్యా నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తామని ఆయన ప్రకటించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

టేకులపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్ లక్కినేని సురేందర్‌రావుపై అవిశ్వాస తీర్మాణం ప్రకటిస్తూ పీఏసీఎస్ మెజార్టీ డైరెక్టర్లు సోమవారం జిల్లా కోఆపరేటివ్ అధికారి సయ్యద్ ఖుర్షిద్‌కు లిఖితపూర్వకంగా అందజేశారు. 2020 ఫిబ్రవరిలో జరిగిన బేతంపూడి పీఏసీఎస్ ఎన్నికల్లో 13డైరెక్టర్లకు గాను ఆరుగురు డైరెక్టర్లు బీఆర్ఎస్ నుంచి, మరో ఆరుగురు డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందగా ఒక డైరెక్టర్ ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. ఇండిపెండెంట్ డైరెక్టర్ మద్దతుతో బీఆర్ఎస్ డైరెక్టర్ లక్కినేని సురేందర్‌రావు చైర్మన్ పదవీని పొందారు. కాని ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల వల్ల బీఆర్ఎస్‌లో గెలుపొందిన ఆరుగురు డైరెక్టర్లలో మెజార్టీ డైరెక్టర్లు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో చైర్మన్‌పై అవిశ్వాసానికి పూనుకున్నారు. డీసీవో కార్యాలయంలో సోమవారం పీఏసీఎస్ 9 మంది డైరెక్టర్లు డీసీవోకు అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటిస్తూ లిఖితపూర్వకంగా అందచేశారు. కాగా ఈ నెల15తో పీఏసీఎస్ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియనుండగా అవిశ్వాసానికి పూనుకోవడం గమనార్హం.

అంతర్జాతీయ కరాటే ఛాంపియన్స్ పోటీల్లో భద్రాద్రికి ఆరు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న కాశీహుస్సేన్

చుంచుపల్లి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి):ఇటీవల హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్స్ 2025 పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఆరు పతకాలు వరించాయి. వీరిలో అండర్ -10 బాలుర కటాస్ విభాగంలో బి.భానుకృష్ణ కాంస్య పతకం, అండర్10 బాలికల కటాస్ విభాగంలో యంఏ.సనా బంగారు పతకం, అండర్-12 బాలుర కటాస్ విభాగం ఏ.జస్వంత్ బంగారు పతకం, ఎంఏ ఆయాన్ వెండి ప తకం, అండర్-14 బాలుర కటాస్ విభాగంలో యల్ .హర్షిత్ వెండి పతకం అండర్-14 బాలికల కటాస్ విభాగంలో ఏ.ఆశ్రిత బంగారు పతకం గెలుపొందారు. క్రీడాకారులను మాజీ అంతర్జాతీయ కరాటే క్రీడాకారుడు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్, సీనియర్ కరాటే మాస్టర్ ఐ.ఆదినారాయణ అభినందించారు.

విద్యార్థిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

దమ్మపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దమ్మపేటకు చెందిన ఒక విద్యార్థిని లైంగిక వేధింపులకు పాల్పడుతూ తనను పెళ్లిచేసుకోవాలంటూ వేధిస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మందలపల్లి గ్రామానికి చెందిన నరేంద్ర బార్గవ్ అనే యువకుడు దమ్మపేటకు చెందిన 19 సంవత్సరాల విద్యార్థినిని లైంగికంగా వేదించటంతో పాటు తనను పెళ్లి చేసుకోవాలని లేదంటే చంపేస్తానని కొంతకాలంగా బెదిరిస్తున్నాడు. విద్యార్థిని ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. యువతి తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఏకలవ్య పాఠశాల విద్యార్థినికి అస్వస్థత

దమ్మపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గండుగులపల్లి ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి అస్వస్థతకు గురికావటంతో పాఠశాల సిబ్బంది సోమవారం రాత్రి సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. పాఠశాలలో విజయలక్ష్మి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. పాఠశాలలో ఫేర్‌వెల్‌డే నిర్వహించినట్లు సమాచారం. విద్యార్థిని అకస్మాత్తుగా కిందపడిపోవటంతో వెంటనే వైద్యశాలకు తరిలించి చికిత్స నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా ఆస్మాతో బాధపడుతున్నట్లు తెలిసింది.

సత్తుపల్లి వైద్యశాలలో చికిత్స

విద్యార్థిని శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు పడటంతో మెరుగైన వైద్యం కోసం విద్యార్థిని ఖమ్మం వైద్యశాలకు తరిలించినట్లు సమాచారం.



చికిత్స పొందుతున్న విద్యార్థిని

బయట విందు..లోపల మందు

(5వ పేజీ తరువాయి)

తెచ్చుకోకుండా అక్కడికి వెళితే సిబ్బందే ఒక రేటు నిర్ణయించి మద్యం సరఫరా చేస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌కు రూ.150నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలామంది ఫ్యామిలీ దాబాల పేరు చూసి కుటుంబంతో కలిసి అక్కడకు వెళ్లిన తరువాత లోపల జరుగుతున్న మద్యపానం తీరు చూసి వారు భయపడుతున్నారు.

నేరుగా వైన్‌షాపుల నుంచే విక్రయాలు ?

దాబాలు నిర్వహించే వారిలో కొంతమంది యజమానులు దాబాలకు నేరుగా వైన్‌షాపుల యజమానులతో కుమ్మక్కై మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం. నేరుగా అక్కడి నుంచి మద్యం తీసుకొచ్చి సమీపంలో ఒకచోట నిల్వ చేసి సిబ్బందితో వాటిని తెప్పించి అమ్ముతున్నట్టు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో వైన్, బార్లు మూసేయటంతో మందుబాబుల బలహీనతను ఆసరాగా చేసుకొని, బెల్ట్ షాపుల నుంచి మద్యం తీసుకొస్తున్నట్లు చెప్పి సొమ్ములు గుంజుతున్నారనే ఆరోపణలుబహిరంగంగానే వినిపిస్తున్నాయి. మద్యం తాగేవారికి ప్రత్యేకంగా పార్కింగ్‌లలో టెబుల్స్ వేసి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

అర్ధరాత్రి దాబాల వద్ద ఘర్షణలు..

దాబాల్లో అర్ధరాత్రి వరకు మద్యం తాగేందుకు యజమానులు అనుమతించడంతో మందుబాబులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. మద్యంమత్తులో సంబంధం లేని వారితో ఘర్షణలకు దిగటం, దాడులకు పాల్పడటం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాబాల పక్కనుంచి వెళ్లే ద్విచక్రవాహనదారులు మందుబాబుల ఆగడాలను చూసి భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవలే నగర శివారు మండలంలో ఒక దాబాలో కొంతమంది కలిసి మద్యం తాగి మాటమాట పెరిగి ఘర్షణకు పాల్పడ్డారు. ఈ గొడవలో పలువురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స కూడా పొందారు. అదేవిధంగా దాబాలకు వచ్చేవారు వారి వాహనాలు రహదారుల పక్కనే నిలుపుతుండటంతో రోడ్డుపై వెళుతున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీవాహనాలను దాబాల పక్కన నిలిపి, మద్యం తాగుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

తనిఖీలు మరిచిన పోలీసులు

దాబాల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా పోలీసులు మాత్రం తనిఖీలు మరిచారు. పోలీసుల తనిఖీలు లేకపోవడంతోనే దాబాల యజనమానులు ఇష్టారితిన వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులతో పాటు సంబంధిత అధికారులకు ప్రతినెల మాముళ్లు పంపించాలని దాబాల యజమానులు చెబుతున్నారు. ఈ కారణంగానే వారు దాబాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోలింగ్ వాహనాల సిబ్బంది సైరన్ మోగిస్తూ అక్కడికి వచ్చి ఏదో ఆర్డర్ ఇచ్చి ఆహారం తీసుకుని బయటినుంచి వెళ్లిపోతున్నారని, వారు సైరన్ మోగించినప్పుడు దాబాల యజమానులు, సిబ్బంది మద్యం తాగేవారి వద్ద లైట్లు ఆపేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా పోలీసులు దాబాల్లో నామమాత్రంగా ముందువైపు తనిఖీలు చేస్తున్నారు. కానీ మద్యం బాబుల కోసం ప్రత్యేకంగా పార్కింగ్‌లలో చేసిన ఏర్పాట్లను మాత్రం చూడకుండా వెళుతున్నారు. ఈ నేపథ్యంలో దాబాల్లో నడుస్తున్న మద్యం విక్రయాలపై పోలీస్ బాస్ దృష్టిపెట్టి కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైన్‌షాపుల నుంచి పోలీసులకు మందు బాటిళ్లు ?

నగరంలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న వైన్‌షాపులు, బార్ల నుంచి ప్రతినెల డబ్బులతో పాటు, మందు బాటిళ్లు పంపించాలని కొందరు వైన్‌దుకాణాలకు చెందిన సిబ్బంది చెబుతున్నారు. అవి అందితేనే మద్యం వ్యాపారాలను పోలీసులు చూసి చూడనట్టు ఉంటారని చెబుతున్నారు. వైన్ షాపులముందు పార్కింగ్ చేసిన వాహనాలకు సైతం పోలీసులు ఫైన్లు విధించరు. ఒకవేళ పోలీసు సిబ్బంది వాహనాలు తీసివేయాలని చెబితే వెంటనే షాపుల యజమానులు పో లీస్ అధికారులకు ఫోన్ చేసి చెబుతారు. దీం తో వెనక్కి రావాలని అధికారులు సిబ్బందికి ఆదేశిస్తారు. అదేవిధంగా ఒక్కో వైన్‌షాప్ నుంచి స్టేషన్‌కు నెలకు మూడు ఫుల్‌బాటిళ్లు, రూ. 5వేలు మాములు ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు స్టేషన్‌నుంచి ప్రత్యేకంగా సిబ్బంది వెళ్లి తీసుకొస్తున్నట్లు ప్రచారం జరుగుతుతోంది.

పరిషత్ ఎన్నికలకు కసరత్తు

» ఖమ్మం జిల్లాలో 8,22,528 మంది ఓటర్లు

» జాబితా విడుదల చేసిన అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు ఖమ్మం జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా, మండల పరిషత్ అధికారులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలపై దృష్టి సారించారు. ఇప్పటికే పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యే నాటికి వచ్చిన అదనపు ఓటర్లను కూడా చేర్చి జాబితాలు రూపొందిస్తున్నారు. సోమవారం జిల్లాలోని ఎంపీటీసీల వారీగా ఆయా గ్రామాల్లో మండల, జిల్లా పరిషత్తుల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. జిల్లాలో మొత్తం 8లక్షల 22,528 మంది ఓటర్లుగా లెక్కతేల్చారు. వీరిలో 3లక్షల 97,766 పురుషులు, 4లక్షల 24,739 మంది మహిళా ఓటర్లు థర్డ్ జెండర్లు 23 మంది ఉన్నట్లు తేల్చారు. ప్రజలకు ఓటర్లకు, రాజకీయ పార్టీలకు అనుగుణంగా వీటిని ప్రదర్శనకు పెట్టారు. సోమవారం జిల్లా పరిషత్‌లో పోలింగ్ సామగ్రిని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, జడ్పీ సీఈవో దీక్షరైనా, డీపీవో ఆశాలతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భగా పలు సూచనలు చేశారు.

పరిషత్ ఎన్నికల కసరత్తు ఇలా..

●11వ తేదీన స్థానిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లా వ్యాప్తంగా వెల్లడిస్తారు. గతంలో 589 పంచాయతీలు ఉండగా, ఇటీవల కొన్ని పంచాయతీలు నగరపాలికలు, మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో వీటి సంఖ్య తగ్గనుంది. ఎంపీటీసీ స్థానాల్లో కూడా మార్పులు చేశారు. గతంలో 289ఎంపీటీసీలు ఉండగా ప్రస్తుతం 288కి తగ్గినట్లు అధికారులు తెలిపారు.

●12న పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 12, 13వ తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి అవసరమైన మార్పులు చేర్పులు చేపటనున్నారు.

● 13న పరిషత్ ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎంపీడీవోలు సలహాలు, సూచనలు తీసుకుంటారు. పోలింగ్ కేంద్రాల విషయంలో వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటారు.

● 14న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతి తీసుకుంటారు.

●15న తుది ఓటరు జాబితాను, పోలింగ్ కేంద్రాలను ప్రకటిస్తారు.

● పార్టీ గుర్తులతోనే ఎన్నికలు

ఎంపీటీసీ, జడ్పీటీసీలకు రాజకీయ పార్టీల గుర్తులతోనే ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల తేదీ ప్రకటించడానికి ముందే ఆయా రాజకీయ పార్టీలు కూడా సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎన్నికల నిర్వహణపై సంకేతాలు ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించే నాటికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించడంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బోనకల్	17663	18785	1	36449
చింతకాని	19979	21694	0	41673
ఏన్కూరు	13462	14639	1	28102
కల్లూరు	26567	28032	0	54599
కామేపల్లి	17442	181170	3	5559
ఖమ్మం రూరల్	16357	17732	2	34091
కొణిజర్ల	20378	21541	0	41919
కూసుమంచి	24321	26035	1	50357
మధిర	15306	16409	2	31717
ముదిగొండ	23368	25387	2	48757
నేలకొండపల్లి	23952	26150	1	50103
పెనుబల్లి	21466	22665	0	44111
రఘునాధపాలెం	19555	21544	6	41105
సత్తుపల్లి	17487	18750	1	36238
సింగరేణి	22301	23368	4	45673
తల్లాడ	22603	23774	1	46378
తిరుమలాయపాలెం	24493	26230	0	50723
వేంసూరు	18225	18953	0	37178
వైరా	13203	141310	2	7334
ఎర్రుపాలెం	19658	20803	1	40462
మొత్తం	3,97,766	4,24,739	23	8,22,528

తునికాకు సేకరణ ఎప్పుడు?

(5వ పేజీ తరువాయి)

సేకరణకు టెండర్లు పిలవాలని గిరిజనులతో పాటు పలు పార్టీలకు చెందిన నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో 14జిల్లాల్లో ఈ తునికాకు సేకరణ జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన, గిరిజనేతరులకు సంబంధించిన 10లక్షలమంది ప్రజలకు ఈ తునికాకు సేకరణతో జీవనోపాధి పొందుతున్నారు. తునికాకు సేకరణ సమయంలో అడవుల్లోకి వెళ్లే గిరిజన, గిరిజనేతర కూలీలకు రక్షణ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే వేసవి ప్రభావం తెలుస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు 35డిగ్రీలుగా నమోదవుతున్నాయి. మరికొన్ని రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. దీంతో ఫిబ్రవరిలోనే తునికాకు సేకరణ ప్రారంభం కావాల్సి ఉంది. వాస్తవానికి జనవరి నాటికే అటవీశాఖ తునికాకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఈ ఏడాది ఆలస్యమవుతోంది. ప్రతి ఏడాది టెండర్ల పక్రియ పూర్తి చేసిన తర్వాత ఫిబ్రవరిలో తునికాకు ప్రూనింగ్ చేపడతారు. దీని వల్ల ఎక్కువగా ఆకుసేకరణ జరిగి ప్రభుత్వానికి కూడా లాభాలు వస్తాయి. కానీ ఈ పని సకాలంలో జరగడం లేదు. అటవీశాఖాధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



తునికాకు టెండర్ల పక్రియ వెంటనే పూర్తి చేయాలి

సీపీఎం భద్రాద్రి జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అడవుల్లో వెంటనే తునికాకు టెండర్లను పూర్తి చేసి తక్షణమే ఆకుసేకరణ పనులను చేపట్టాలి. పేదలకు ఉపాధి కల్పిస్తున్న తునికాకు సేకరణకు వాస్తవంగా జనవరి నాటికే టెండర్లపక్రియ అటవీశాఖ పూర్తి చాయాలి. కానీ ఈ ఏడాది ఆలస్యం చేస్తోంది. సీజన్ మించిపోకముందే గిరిజన, గిరిజనేతరుల పేదలకు తునికాకు సేకరణ పనులు అప్పగించాలి. ఇప్పటికైనా తునికాకు సేకరణ పనులను వెంటనే ప్రారంభించాలి.

జాతీయ మాస్టర్ బ్యాడ్మింటన్‌కు చంద్రకళ



చంద్రకళకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

అశ్వాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అశ్వాపురం గౌతమీనగర్ కాలనీకి చెందిన ఎం. చంద్రకళ మాస్టర్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 6నుంచి 9వరకు రాష్ట్రస్థాయి మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీలు కొత్తగూడెంలో నిర్వహించారు. ఈపోటీల్లో చంద్రకళ 50+ గ్రూపులో సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో మార్చిలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైంది.

జాతీయ అథ్లెటిక్స్‌లో సింధుకు రజతం



చుంచుపల్లి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం న్యూస్టార్స్ అథ్లెటిక్స్ క్రీడాకారిణి మాలోత్ సింధుకు రజత పతకం వరించింది. ఉత్తరఖండ్‌లో కొనసాగుతున్న 38వ జాతీయ క్రీడల్లో భద్రాద్రి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి రాణించింది. సింధు 400 మీటర్ల రిలే పరుగు పందెంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. కోచ్ నరేష్, క్రీడాకారిణి సింధుకు సోమవారం తెలంగాణ స్టేట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ సారంగపాణి, జిల్లా యువజన క్రీడా కార్యాలయం అధికారి ఎమ్.పరందామరెడ్డి, వెటరన్ అథ్లెట్ సముద్రాల శ్రీనివాస్, పిడి డాక్టర్ సావిత్రి, జాతీయ క్రీడాకారులు ఎండీ జాబ్బి, న్యూస్టార్స్ అథ్లెటిక్స్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

క్రీడా స్ఫూర్తి విస్తరణలో

అణుశక్తి పాత్ర ప్రశంసనీయం

- ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు చైర్మన్ దినేష్‌కుమార్ శుక్లా
- అట్టహాసంగా 39వ అణుశక్తి క్రీడలు ప్రారంభం

అశ్వాపురం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): దేశంలో క్రీడా స్ఫూర్తిని విస్తరింపజేయటంలో అణుశక్తి విభాగం వహిస్తున్న పాత్ర ప్రశంసనీయమని ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు చైర్మన్ దినేష్‌కుమార్ శుక్లా అన్నారు. అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలోని భారజల కళావేదికలో సోమవారం అణుశక్తి విభాగం 39వజాతీయ క్రీడా, సాంస్కృతిక పోటీలను ఆయన ముఖ్యఅతిథి గా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో వివిధ పరిశ్రమలలో పనిచేసే ఉద్యోగుల మధ్య స్నేహ, సౌభ్రాతృత్వాలు పెంపొందుతాయన్నారు. ముందుగా దేశంలోని వివిధ అణుశక్తి యూనిట్లనుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని, గౌరవ వందనం స్వీకరించారు. క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడుతాయని అన్నారు. క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహిస్తున్న బాడ్మింటన్ పోటీలు జీవితానికి చాలా ఆరోగ్యకరమైనవని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమాన స్థాయిలో స్వీకరించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు కొనసాగాలని ఆకాంక్షించారు.

క్రీడాకారులు గెలుపు, ఓటమిలతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని హెవీవాటర్ బోర్డు(ముంబై) చైర్మన్ ఎస్.సత్యకుమార్ ఆకాంక్షించారు. డీఏఈ క్రీడా పోటీలకు విశిష్ట అతిథిగా హాజరయిన ఆయన మాట్లాడారు. క్రీడలతో ఉద్యోగుల్లో ఉన్న ఒత్తిడిని జయించటమేకాక ఉత్పత్తిరంగాల్లో రాణించవచ్చన్నారు.

39వ జాతీయ క్రీడల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని హెవీవాటర్ ప్లాంట్ జీఎం హెచ్‌కే శర్మ కోరారు. క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రకటించి మాట్లాడారు. క్రీడా పోటీలకు మణుగూరు భారజల కర్మాగారం వేదిక కావటం గర్వ కారణమన్నారు. కార్యక్రమంలో హెవీవాటర్ బోర్డు ఆర్థిక సలహాదారు ముదిత్ శ్రీవాస్తవ, ప్లాంట్ సీఏవో వేణు, డీజీఎం జీవీఎస్‌వీ శర్మ, క్రీడల కోకన్వీనర్ రఫిక్‌అహ్మద్, కార్యదర్శి కోటేశ్వరరావు, ప్లాంట్ గేమ్స్ కార్యదర్శి కందుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దినేష్‌కుమార్ శుక్లా, సత్యకుమార్



గౌరవ వందనం సమర్పిస్తున్న క్రీడాకారులు

ఎనిమిది యూనిట్ల నుంచి క్రీడాకారుల రాక

ఈ పోటీలకు దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది అణుశక్తి యూనిట్ల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మహారాష్ట్రకు చెందిన అజంతా, ఎల్లోరా, గుజరాత్‌కు చెందిన ద్వారక, తమిళనాడుకు చెందిన రామేశ్వరమ్, తెలంగాణకు చెందిన గోల్కొండ, నాగార్జున పశ్చిమబెంగాల్ కు చెందిన కోణార్క్, పుష్కర్ జట్లు పాల్గొంటున్నాయి. క్రీడా పోటీలు ఈనెల 14న ముగియనున్నాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అణుశక్తి జాతీయ క్రీడల ప్రారంభం సందర్భంగా ఏఈసీఎస్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, దేశభక్తికి సంబంధించి ఆలపించిన గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన గణపతి వక్రతుండాయ నృత్యంతో పాటు, సైన్స్‌తో సమ్మేళనమైన ఇంద్రజాలం పలువురుని ఆకట్టుకుంది.

క్రైం సమాచారం

ఇద్దరు బాలికల కిడ్నాప్

- 24గంటల్లో ఛేదించిన పోలీసులు

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): 14 ఏళ్ల ఇద్దరు బాలికలను నలుగురు యువకులు కిడ్నాప్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధికి చెందిన ఇద్దరు బాలికలను రెండురోజుల క్రితం ఇద్దరు యువకుల సహకారంతో మరో ఇద్దరు యువకులు కిడ్నాప్ చేశారు. తర్వాత వారిని హైదరాబాదుకు తీసుకెళ్లడంతో బాలికల కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక బృందంతో గాలించి 24 గంటల్లోనే బాలికలను గుర్తించి సురక్షితంగా కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా ఈఘటనలో కిడ్నాప్‌కు యత్నించిన వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిసింది. 24 గంటల్లో కేసును ఛేదించిన సీఐ ఉదయ్‌కుమార్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినట్టు కూడా తెలిసింది. కాగా ఈఘటనపై సీఐను వివరణ కోరగా కిడ్నాప్ జరిగిన విషయం వాస్తవమేనని తెలిపారు.

గుర్తుతెలియని యాచకుడి మృతి

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని యాచకుడు రోడ్డుపక్కన మృతిచెంది పడి ఉన్న సంఘటన సోమవారం ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని శ్రీనివాసథియేటర్ సమీపంలో ఓ షాపు ముందు సుమారు 50 ఏళ్ల వయస్సున్న యాచకుడ మృతిచెంది ఉన్నాడు. అది గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ

కరకగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పాల పంచాయతీ పరిధిలోని మురికి మడుగు వద్ద ప్రధాన రహదారిపై సోమవారం ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో భట్టుపల్లి పంచాయతీ వీరాపురం క్రాస్‌కు చెందిన ఎండీ ఖదీర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆటో బోల్తా.. ఇద్దరు విద్యార్థులకు గాయాలు



బోల్తా పడిన ఆటో

కారేపల్లి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి):ఆటో బోల్తాపడిన సంఘటన సోమవారం మండల పరిధిలోని ఎర్రబోడు, మాణిక్యారం గ్రామాలసమీపంలో జరిగింది. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు రోజు ఆటోలో వెళుతుంటారు. సోమవారం స్కూల్ అయిపోయిన తరువాత విద్యార్థులతో వస్తున్న ఆటో చెట్టుకు ఢీకొని పల్టీకొట్టింది. దీంతో ఆటోలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు కాగా, ఆటో డ్రైవర్‌కు కూడా దెబ్బలు తగిలాయి. వారిని చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

వయోభారంతో ఆంబోతు మృతి

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకగిరి సిరిపురంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఆంబోతు సోమవారం మృతిచెందింది. 2009లో ఈ ఆంబోతును శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అప్పగించారు. అప్పటి నుంచి సిరిపురం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ తెల్లజాతి పశుసంపద అభివృద్ధికి తోడ్పడింది. సిరిపురం సమీపంలోని తల్లాడ మండలం మంగాపురం వెళ్లిన ఆంబోతు వయోభారంతో అక్కడే మృతిచెందింది. అక్కడి నుంచి ఆంబోతును సిరిపురం తీసుకువచ్చి పూజలు చేసి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి

ఎర్రుపాలెం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి నడిపే ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ పి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరంకు చెందిన వేముల లక్ష్మయ్య (45) పంటల వంటచెరుకు తెచ్చేందుకు ఖాళీ ట్రాక్టర్ ట్రాలీతో ఎర్రుపాలెం నుండి మధిరకు బయలుదేరాడు. మీనవోలు గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న మట్టి కుప్ప పైకి పోవడంతో లక్ష్మయ్య ట్రాక్టర్ కింద పడిపోయాడు. ట్రాలీ టైర్ తనపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

చింతకాని, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామంలో కోడి పందేలు ఆడుతున్న స్థావరంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు. రూ 9వేల నగదు, కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెదురు సాగుతో సిరుల పంట

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వెదురు సాగు చేయడం వల్ల రైతుల ఇంట సిరుల పంట పండినట్లేనని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో చంద్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాల ఎపీఎంలు, ఎపీవోలు, సీసీలు, ఎఫ్‌పీసీలు, వీవోఎసీలు, అటవీశాఖ సిబ్బందికి వెదురు పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లా కలెక్టర్ హజరై మాట్లాడుతూ జిల్లాలో 6లక్షల 18వేల వెదురు సాగు లక్ష్యంని ఖచ్చితంగా చేరుకోవాలని అందుకు గాను ఇండస్ట్రీస్ క్రాప్ ఫౌండేషన్ వారు మన జిల్లాలో వెదురు సాగు చేయడానికి సులభమైన పద్ధతులు, వివిధ రకాల వెదురు సాగు, వెదురుసాగు వల్ల ఉపయోగాలు, వెదురు ఉత్పత్తులు తదితర వాటిపై రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

జిల్లాలో చంద్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాల్లోని భూములు వెదురు సాగుకు ఎంతో అనుకూలమని, సాగుకు అవసరమైన నీటి వసతులు పుష్కంగా ఉన్నాయని, ఎవరైతే ఐదు ఎకరాల వ్యవసాయం చేస్తూ బోరు సౌకర్యం ఉన్నటువంటి రైతులు ఒక ఎకరం వెదురు సాగు చేపట్టే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మునగ, వెదురు సాగు అన్ని సమస్యలకు పరిష్కరమని కలెక్టర్ తెలిపారు. వెదురును ఉపయోగించి కేవలం ఫ్లోరింగ్, ప్యానలింగ్ మాత్రమే కాకుండా ఇప్పుడు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు వినియోగంతో ఎక్కువ వాయుకాలుష్యం ఏర్పడుతుందని, దానికి బదులు వెదురు గుళికలు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. తద్వార థర్మల్ విద్యుత్ కేంద్రాలకు భారీగా వెదురు గుళికలు అవసరం పడుతున్నాయని, ఈ అవసరమే వెదురు సాగును లాభాల బాటలో నడిపించనుందని, అంతేకాకుండా నంద్యాలలో పెద్ద సిమెంట్ ఫ్యాక్టరీ వారు వెదురు కొనుటకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలో జామాయిల్ సాగుకు సమానంగా వెదురుసాగు చేపట్టాలని, ఆ దిశగా అధికారులు రైతులకు, అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ఆదివాసీల అభివృద్ధికి వెదురుసాగు ఒక్కటే మార్గమని వెదురు సాగు ద్వారా ఆదివాసీల సంప్రదాయ వస్తువుల తయారీ చేపట్టవచ్చని, అదేవిధంగా పోడు వ్యవసాయంలో వెదురుసాగు చేపట్టేల అటవీశాఖాధికారులు ఆదివాసీలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఉద్యానవనశాఖ అధికారి కిషోర్, ఇండస్ట్రీ క్రాప్ట్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ రమ్య, డాక్టర్ శ్రీకాంత్, ఆపరేషన్ మేనేజర్లు అమృత, అక్షయ్, టెక్నికల్ మేనేజరు కుసుమ కుమారి, మూడు మండలాల శాఖాధికారులు, ఎపీఎంలు, ఎపీవోలు, సీసీలు, ఎఫ్‌పీసీలు, వీవోఎసీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శారీరక, మానసిక వికలాంగుల

సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ చంద్రశేఖర్

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవాసదన్‌లో సోమవారం పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతుల కార్యక్రమానికి న్యాయాధికారి కేవీ చంద్రశేఖర్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక మానసిక వికలాంగుల సంరక్షణ మన అందరి బాధ్యతని అన్నారు. వీరికి ఆరోగ్య సంరక్షణ, చికిత్స, పునరావాసం కల్పించటం మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం ప్రత్యేకత అని అన్నారు. సమాజంలో ఉన్న మానసిక వికలాంగులకు చికిత్స అందించటానికి ఈ చట్టంలో ప్రాధాన్యం కల్పించారని, ఈ చట్టం 2017లో వచ్చిందని, జూలై 7 2018 నుంచి అమలులో వచ్చిందని తెలపారు. ప్రభుత్వాలు చట్టం అమలుకోసం మానసిక ఆరోగ్య సమీక్ష బోర్డు, మానసిక ఆరోగ్య అథారిటీ ఏర్పరచి వీరికి చికిత్స, పునరావాసం కల్పించారని తెలిపారు. అనంతరం చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు, న్యాయవాదులు పి.పద్మావతి, ఇమ్మడి లక్ష్మినారాయణ, కె.రామలక్ష్మి లు మాట్లాడుతూ రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబులిటీ యాక్ట్ 2016, మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్ చట్టాల గురించి పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల నుంచి వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచార యత్నం

- తప్పించుకునే క్రమంలో ఆమెపై కత్తితో దాడి

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కూలి పని ఉందంటూ 20ఏళ్ల మహిళను తీసుకెళ్లిన ఓ వ్యక్తి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. ఈ క్రమంలో తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఆ మహిళపై సదరు వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో జరిగింది. లక్ష్మీదేవిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గొత్తికోయ మహిళను కూలి పని ఉందంటూ లక్ష్మీదేవిపల్లి పోస్టాఫీస్‌సెంటరులోని అడ్డా నుంచి ఓ వ్యక్తి ఆటోలో తీసుకెళ్లాడు తరువాత అనిశెట్టిపల్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఆ మహిళపై సదరు వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. దాంతో మహిళ తప్పించుకునే ప్రయత్నం చేయగా అతడు కత్తితో దాడి చేయడంతో ఆమెపై ముఖంపై తీవ్ర గాయమైంది. ఈ పరిణామంతో సదరు అగంతకుడు వెంటనే తప్పించుకొని పారిపోయాడు. తరువాత స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు సోమవారం గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలిసినవారు కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ వారిని సంప్రదించి 8712682019 ఫోన్ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని రాపర్తినగర్‌కు చెందిన నేలపాటి అశోక్‌కు చెల్లనిచెక్కు కేసులో ఆరు నెలలు జైలుశిక్షతోపాటు రూ.2లక్షల పరిహారం చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఖమ్మం రూరల్ మండలం రాజీవ్‌గృహకల్ప కు చెందిన ఫిర్యాది బుడిగ నరేష్ వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం ఫిర్యాది వద్ద డిసెంబరు 15, 2019న రూ.2లక్షలు అప్పుగా తీసుకొని ఆదేరోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చాడు. ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా జూన్ 14, 2021న నిందితుడు రూ.2లక్షలకు చెక్కు జారీచేశాడు. ఆ చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితుడి ఖాతాలో సరిపడా నగదులేనందున చెక్కు తిరస్కరణకు గురైంది. తరువాత ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలుచేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో జైలు శిక్ష విధించారు.

వైభవంగా పర్ణశాల

రామయ్య కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన మండలంలోని పర్ణశాల రామాలయంలో సోమవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. తిరుమంజనం, నూతన వస్త్రాలంకరణ, ఆలయ ప్రదక్షిణ, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీత యోత్రధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మంగళాష్టకాలు, మహాసంకల్పం, మాంగల్యధారణ, మంత్రపుష్పకార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణ ఉభయ దాతలుగా శ్రీరంగమ్ నరసింహాచార్యులు దంపతులు వ్యవహరించారు. ఆలయ ఇంచార్జి అనీల్‌కుమార్, అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, ప్రతీపురం భార్గవాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు, నలదీగల నరసింహాచార్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ముదిగొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మేడేపల్లి గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ రెహ్మాన్(28) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తన ఆటోకు ఫైనాన్స్ చెల్లించడం కోసం తల్లి హుస్సేన్‌బీ పనిచేస్తున్న గడల పుల్లయ్య వద్ద రెండు సంవత్సరాల క్రితం రూ.50వేలు అప్పుగా ఇప్పించింది. ఆదివారం సాయంత్రం పుల్లయ్య తన రూ.50వేలు ఇవ్వాలని రెహ్మాన్‌ను అడిగినట్లు రెహ్మాన్ ఆ విషయాన్ని తండ్రి సలీంకు చెప్పాడని, గడల పుల్లయ్య తిట్టడం వల్లనే తన కుమారుడు మనోవేధనకు గురై ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి సలీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సలీం ఫిర్యాదు మేరకు ముదిగొండ సీఐ మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోతినేని సుదర్శన్‌రావు

సాయుధ పోరాట యోధురాలు

సీతమ్మ కన్నుమూత

బోనకల్, ఫిబ్రవరి 10: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఏడునూతల సీతమ్మ(93) సోమవారం మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రముఖ న్యాయవాది ఏడునూతల శ్రీనివాసరావు మాతృమూర్తి కావడంతో లాయర్ల అసోసియేషన్‌తో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, గ్రామ సీపీఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు.

తెలంగాణా సాయుధ పోరాటాలకు పురిటిగడ్డగా గోవిందాపురం(ఎల్) గ్రామానికి ప్రత్యేక చరిత్ర ఉందని, అమర వీరుల త్యాగాలు మరువ లేనివని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు కొనియాడారు. గ్రామంలో అమర వీరుల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

చుంచుపల్లి, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): కోర్టు వివాదంలో ఉన్న భూముల్లో నిర్మించిన రెండు అక్రమ కట్టడాలు చుంచుపల్లి అధికారులు సోమవారం కూల్చివేసినట్లు చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణ తెలిపారు. మండల రెవెన్యూ పరిధిలోని విద్యానగర్ కాలనీ గ్రామ పంచాయతీలో గల పద్దెనిమిది ఎకరాల భూమి హైకోర్టులో వివాదంలో ఉంది. ఈ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా రాత్రి సమయంలో అక్రమ కట్టడాలను నిర్మించారు. వీరికి పంచాయతీ అధికారులు గతంలో పలుమార్లు నోటీసులు అందజేశారు. సదరు వ్యక్తులు పట్టించుకోకపోవడంతో నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. చేసేదేమి లేక బాధితులు నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోర్టు వివాదంలో ఉన్న ఈ భూమిలో నిర్మాణాలు చేపట్టినందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చుంచుపల్లి మండల అధికారులను ఆదేశించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది పోలీస్, గ్రామ పంచాయతీ, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సహకారంతో ఎక్స్‌కవేటర్‌తో భారీ బందోబస్తు నడుమ నేలమట్టం చేశారు. ఈ కూల్చివేతలో సుమారు 200 మంది సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సుగుణమ్మ మృతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల నాయకురాలు కొక్కిరేణి మాజీ సర్పంచ్ చావా సుగుణమ్మ (88) సోమవారం మృతిచెందారు. ఆమెకు ముగ్గురు కుమారులున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కార్యవర్గసభ్యుడు హేమంతరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.



వైభవంగా ఇరుముడి కార్యక్రమం

నేలకొండపల్లి, ఫిబ్రవరి10: మండల పరిధిలోని కొత్తకొత్తూరులోని శ్రీప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో సోమవారం శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి భక్తుల ఇరుముడి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు, హాజరయ్యారు. కార్యక్రమంలో కొత్తూరు మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	44
బీరకాయ	48
పచ్చిమిర్చి	28
కాకరకాయ	44
బెండకాయ	44
పొట్లకాయ	34
దోసకాయ	38-38
చిక్కుడు	44
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	20
దొండ	28-36
సొరకాయ	18
క్యారెట్	20
క్యాప్సికం	48
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	35-40
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా

- అధికారులు సమయాన్ని పాటించాలి
- ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'వారంలో ఒక్కసారి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులు ఎందుకు హాజరు కావడం లేదు.. ప్రజావాణికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేయండి' అంటూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని దీన్ని కూడా సీరియస్‌గా తీసుకోకుంటే ఎలా అని ప్రశ్నించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో ఏ పద్మజ, డీఆర్డీవో సన్యాసయ్య లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గైర్హాజరైన అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలు వస్తాయని వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అంతటి కార్యక్రమానికి రాలేకుంటే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు సమాచారం అందించాలన్నారు. జిల్లా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా జిల్లా అధికారులు హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ హెచ్చరించారు. అధికారులకు శాఖాపరమైన సమావేశాలు ఉంటే ముందుగా జిల్లా యంత్రాంగం అనుమతి తీసుకోవాలని, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు ఉదయం సమయానికి వచ్చి అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేని సమయంలో, సీనియర్ అధికారి ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని, ప్రజలతో మర్యాదగా, జవాబుదారీతనంతో ప్రవర్తించాలన్నారు. ప్రజావాణికి సంబంధించి వచ్చిన అర్జీలను పరిశీలన చేసి పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ, పర్యవేక్షకులు కారుమంచి శ్రీనివాసరావు జిల్లా అధికారులు డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, డీఎస్వో చందన్‌కుమార్, డీఎం శ్రీలత, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ



వినతులు స్వీకరిస్తున్న శ్రీజ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు అందించే సమస్యలను సత్వరం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పేర్కొన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జీ కమిషనర్‌గా ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి వసుందర, టీఎంసీ గుడిపూడి సుజాత తదితర అధికారులు పాల్గొన్నారు.

బస్ డిపో రోడ్డుకు మోక్షం

ప్రజల కోరిక మేరకు డివైడర్ల తొలగింపు


డివైడర్లను తొలగిస్తున్న దృశ్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం బైపాస్ రోడ్డు నుంచి ఖమ్మం నగరంలోకి వాహనాలు ప్రవేశించాలంటే ముఖ్యంగా రాపర్తినగర్ సెంటర్ నుంచి మయూరిసెంటర్ ద్వారా వాహనదారులు నగరంలోకి చేరుకుంటారు. దీంతో పాటుగా మామిళ్లగూడెం, బుర్హాన్‌పురం, లెనిన్‌నగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల ప్రజలు ఇదే రహదారి ద్వారా ప్రయాణాలు చేస్తుంటారు. ఖమ్మం నగరం సుందరీకరణకు గత ప్రభుత్వంలో రహదారుల వెడల్పుతో సంబంధం లేకుండా డివైడర్లను ఏర్పాటు చేశారు. వాటికి సెంట్రల్ లైటింగ్‌ను నిర్మాణం చేశారు. 50 అడుగుల వెడల్పు ఉన్న బస్ డిపో రోడ్డుకు డివైడర్లను నిర్మించడంతో రోడ్డు దాటాలంటే బస్సు, కారు వంటి వాహనాలు ఒక దాని తర్వాత మరొకటి 5 కి.మీ. వరకు ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే రహదారి వెంట బస్ డిపో ఉండటంతో బస్సుల రవాణాకు ఇబ్బందిగా మారింది. స్థానిక ప్రజలు, కార్పొరేటర్లు, వామపక్ష పార్టీల నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి బస్ డిపో రోడ్డు డివైడర్లను తొలగించాలని కోరారు. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో డివైడర్లు తొలగింపు కార్యక్రమం సోమవారం మొదలైంది.

ఉపకారవేతనాల బకాయిలు చెల్లించాలి: పీడీఎస్‌యూ

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్సుమెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్సుమెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించని కారణంగా విద్యార్థులు, కళాశాల జమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తుందన్నారు. ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ యూనివర్శిటీ ఏర్పాటుపై ప్రకటన చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి జార్జిరెడ్డి పీడీఎస్‌యూ దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు.

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

దివ్యాంగుల అభ్యున్నతికి చర్యలు

- దివ్యాంగులతో కలెక్టర్


దివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు తమ సమస్యలు తెలుపుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి సభ్యులు వినతి పత్రాన్ని అందించారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆటో స్టాండ్ ఒకే సంఘానికి కాకుండా వివిధ సంఘాలకు లేదా టెండర్ రూపంలో ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో బిజీ సెంటర్లలో ట్రీ టీ స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని, పేద, దివ్యాంగ మహిళలకు కూడా టీ స్టాల్స్ కేటాయిస్తామని అన్నారు. దివ్యాంగుల కుటుంబ పరిస్థితులను, స్థితిగతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే ఇందిరమ్మ ఇండ్లలో కూడా దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా విడతల వారీగా ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.స్వయం ఉపాధి క్రింద యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి గల దివ్యాంగుల పేర్లు, దరఖాస్తులు అందించాలని, మహిళలు ఎవరైనా ఉంటే మహిళాశక్తి కింద అందిస్తామని, పురుషులకు ఇతర పథకాల క్రింద, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, ఉపాధి కల్పనకు ఉన్న అవకాశాలపై దివ్యాంగులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ వారికి వివరించారు.

ఘనంగా హార్వెస్ట్ టెండర్ రూట్స్ 15వ వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవిమారుత్

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ టెండర్‌రూట్స్ 15వ వార్షికోత్సవం సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా న్యాయవాది ఐలూ స్టేట్ ప్రెసిడెంట్ కొల్లి సత్యనారాయణ, విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, టెండర్‌రూట్ హెచ్ఎం హసీమా, అకడమిక్ ఇన్‌చార్జి ఉషశ్రీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్యావిధానం అవసరమని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యావిధానంలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ బోధించాలన్నారు. చదువంటే పుస్తకాలు, అక్షరాలు మాత్రమేకాదని, క్రీడలు సంస్కృతి కార్యక్రమాలు వంటి విజ్ఞానదాయక కార్యక్రమాలలో విద్యార్థులకు భాగస్వామ్యం కలిపిస్తే మరింత ఉన్నతంగా రాణిస్తారని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సందడిగా ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

ఖమ్మం ఖానాపురంహవేలీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని సైన్స్ మ్యూజియంలో సోమవారం ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందించారు. మొదటి బహుమతి జీహెచ్ఎస్ మధిర ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి సాయిగౌతమ్, తెలుగు మీడియం నుంచి జడ్పీహెచ్ఎస్ మీనవోలు విద్యార్థి మణికుమార్, ద్వితీయ బహుమతి జడ్పీహెచ్ఎస్ పినపాక విద్యార్థి ఎస్‌కె సిరాజ్, ద్వితీయ బహుమతి జడ్పీహెచ్ఎస్ తెల్దెలపాడు విద్యార్థి వి. నరేష్, తృతీయ బహుమతి జడ్పీహెచ్ఎస్ జలగంనగర్ విద్యార్థి పి. వెన్నెల, జడ్పీహెచ్ఎస్ తిరుమలాయపాలెం విద్యార్థి బి. సాయికిరణ్‌కు అందించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ఎంఈవో శైలజాలక్ష్మి, డీసీఈబీ సెక్రటరీ నారాయణ, సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్, ఫోరం నాయకులు శ్రీనివాస్, రవికుమార్‌లు పాల్గొన్నారు. అనంతరం పెసర ప్రభాకర్‌రెడ్డి, సాగి సుజాత, బి. హనుమ, రజాలిలను సన్మానించారు.

ప్రమాదాల నివారణకు అధికారుల చర్యలు


రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ధంసలాపురం బ్రిడ్జి వద్ద తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆర్ అండ్‌బీ అధికారులతో కలిసి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ మోహన్‌బాబు, ఖానాపురంహవేలి సీఐ భానుప్రకాస్ సోమవారం వంతెనను సందర్శించి ప్రమాదాలకు గల కారణాలు విశ్లేషించారు. వంతెన ఇరువైపులా ప్రమాదసూచిక బోర్డులతో పాటు వంతెనపై రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్‌లిమిట్ బోర్డులు, డీప్‌కర్వ్ బోర్డులు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈసందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ర్యాష్ డ్రైవింగ్‌తో వేగ నియంత్రణ కోల్పోవడమని, మద్యంమత్తులో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా ఇటీవల కాలంలో ఈబ్రిడ్జివద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతుండగా నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ జి.చంద్రశేఖర్, ఏఈ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహాయ ఉపకరణాలకు లబ్ధిదారుల ఎంపిక


శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న వయోవృద్ధులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులకు వివిధ రకాలైన సహాయ ఉపకరణాలు కోసం ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ లబ్ధిదారుల ఎంపికను చేపట్టింది. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సోమవారం నగరంలోని రోటరీనగర్ క్లబ్‌లో శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 300 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు హాజరైనట్లు జిల్లా మహిళా శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. 139 మంది దివ్యాంగులు, 16 మంది సీనియర్ సిటిజన్లు వివిధ సహాయ, ఉపకరణాలకు ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సత్తుపల్లి ప్రభుత్వ పాఠశాలలో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు


దయాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జాని

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఖమ్మం గ్రానైట్ మార్కర్ అండ్ బయ్యర్స్ యూనియన్ తరపున జనరల్ సెక్రటరీ షేక్ జానీ ఆధ్వర్యంలో దయార్ రెడ్డికి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ నవీన్ కుమార్, భద్రం, నరసింహారావు, వెంకటేశ్వర్లు, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాల దశలో కౌమార దశలో ఉన్న విద్యార్థుల దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని, అందుకు ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు సహకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ అన్నారు. సోమవారం నగరంలోని టేకులపల్లి మహిళా ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ, విద్యాపరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌమార దశ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె రవికుమార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంబించారు. జిల్లా మెడికల్ డిపార్టుమెంట్ నుంచి డాక్టర్ సత్యకుమార్, ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రభాకర్‌రెడ్డి జ్యూరీ మెంబర్లుగా వ్యవహరించారు. జిల్లాలో మొత్తం 84 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు మొత్తం 148 మంది కౌమార దశ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పోస్టల్ మేళా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో ప్రథమ స్థానంలో జడ్పీహెచ్ఎస్ సత్తుపలి విద్యార్థిని సబియాబేగం, ద్వితీయ స్థానంలో ఖమ్మం నగరంలోని గోర్కీ పాఠశాల విద్యార్థిని మేఘనలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణం అధికారి వేల్పుల విజేత పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

శ్రీపాల్‌రెడ్డి నామినేషన్‌కు పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు

ఖమ్మం ఖానాపురంహవేలీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఖమ్మం నుంచి సుమారు 300ల మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మం నుంచి ర్యాలీగా నల్గొండకు వెళ్లారు. ర్యాలీని సంఘం కార్యాలయం వద్ద వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వసతులు కల్పించండి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలోని ప్రభుత్వ వైద్యవిధానపరిషత్ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కకలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. మండల కేంద్రంలో ని వైద్యవిధానపరిషత్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆరోగ్య కేంద్రానికి రావాల్సిన పరికరాలు కూడ అందించాలన్నారు. మట్టే నాగేశ్వరరావు, కొమ్ముపూలే, మట్టే బాలరాజు, సురేష్, ఏసుబాబు పాల్గొన్నారు.

వరదల నష్టపరిహారం చెల్లించాలి

మండలంలోని రాకాసితండా లో ఇటీవల వరదలో కొట్టుకుపోయిన పశువులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. వరదలో కొట్టుకుపోయిన ఇళ్లను ప్రభుత్వం తరుపున ఇళ్లు కట్టించి న్యాయం చేయాలని కోరారు. అలాగే వరదలతో నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జిల్లా ఆస్పత్రిలో రోగులకు అన్నదానం


జిల్లా ఆస్పత్రిలో అన్నదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్/ నేలకొండపల్లి/ ఖమ్మం చర్చి కాంపౌండ్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జి తుంబురి దయాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పండ్లు బ్రెడ్‌ను పంపిణీ చేశారు. రామన్నపేట 60 డివిజన్ కాంగ్రెస్ నాయకులు రామన్నపేట కార్పొరేటర్ బద్దె నిరంజన్ కుమార్ ,కాశీనాథ్ న్యూ కార్ప వెంకటేశ్వరావు నువ్వు కార్ప కోటేశ్వరరావు, గొడవర్తి సుధాకర్, షేక్ సైదులు,బంక వెంకన్న , భుక్య చందా , షేక్ వసిమక్రం, షేక్ గులామ హుస్సేన్ ,వీరబాబు ప్రసాదు, నాగేశ్వరరావు, గోపి, వస్త్రం, మధు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సంబురాలు

తుంబూరు దయాకర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో కాంగ్రెస్ కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. గ్రామీణ వైద్యుల సంఘం నాయకుడు షేక్ సోందు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కేక్‌ను కట్ చేశారు.

నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో

తుంబూరు దయాకరరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నగర నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యలమందల జగదీష్ ఆధ్వర్యంలో దయాకరరెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముమ్మరంగా రైల్వే మూడో లైన్ పనులు


కంకరను శుభ్రం చేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పందిళ్లపల్లి- ఖమ్మం రైల్వేస్టేషన్ వరకు మూడో రైల్వేలైన్ పనులను ముమ్మరంగా చేపట్టారు. సోమవారం ట్రాక్‌పై పనులను నిర్వహించారు. ఖమ్మం స్టేషన్ సమీపంలో బీ క్యాబిన్ వద్ద ఇంటర్‌లాకింగ్ సిస్టం పనులను చేపట్టారు. భారీ క్రేన్లతో పట్టాలను తొలగించి కొత్తవి అమర్చుతున్నారు. దీంతో రైళ్ల రాకపోకలను సోమవారం నుంచి రద్దు చేశారు. అంతే కాదు గాంధీచౌక్ రైల్వేగేట్‌ను సైతం మూసేశారు. ఇప్పటికే మూడో రైల్వేలైన్ పనులు మధిర మోటమర్రి వరకు పూర్తి కావస్తుండగా మోటమర్రి పందిళ్లపల్లి వరకు మరో నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఈ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యాన్ని అర్థం చేసుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.


ట్రాక్ పనిలో నిమగ్నమైన సిబ్బంది

ఆంధ్రజ్యోతి
ZONE
మంగళవారం 11 ఫిబ్రవరి 2025
వైరా-మధిర
సత్తుపల్లి
8
WYRA, MADHIRA, SATHUPALLY
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి



అందరికీ పథకాలు అందేలా చూస్తా

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రకటించిన విధంగా ప్రభుత్వ పథకాలను అందరికీ అందేలా చూస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హామీ ఇచ్చారు. ఆపార్టీ నాయకుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వెళ్లి ఆపార్టీ నాయకులతో సంప్రదింపులు జరిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మీ గెలుపు కోసం పూర్తిగా సహకరించామని, ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు ఎమ్మెల్యేను కోరారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు ఇతర సంక్షేమ పథకాలు అర్హులైన తమ పార్టీ వారికి కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకుల పట్ల కాంగ్రెస్ నాయకులు చులకనగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో టీడీపీ వారికి భాగస్వామ్యం కల్పిస్తే త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే సహకరిస్తామని చలపతిరావు స్పష్టం చేశారు. అన్ని విషయాలను సావధానంగా విన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మీకు అన్నివిధాలుగా అండగా ఉంటానని, కలిసి ప్రయాణం చేద్దామని హామీ ఇచ్చారు. మీకు అన్నివిధాలుగా అండగా ఉంటానని టీడీపీ శ్రేణులకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను టీడీపీ నాయకులు శాలువాతో సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్, మందడపు మధుసూదన్‌రావు, కాంగ్రెస్ నాయకుడు దర్శి చెన్నారావు పాల్గొన్నారు.

పంటలకు పూర్తిస్థాయిలో నీరందించాలి

» తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బోనకల్ బ్రాంచ్ కెనాల్‌లో సాగర్‌జలాల సరఫరాలో వారబంది సడలించి చివరి ఆయకట్టు పంటలకు సాగునీరందించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని వల్లాపురం, అష్టగుర్తి మేజర్, మైనర్ల పరిధిలో చివరి భూముల పంటలకు సాగునీరందక పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత పెరగడంతో సాగునీరు అవసరాలు కూడా పెరిగాయని అందువలన వారబంధీ సడలించి చివరి భూములకు నీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కిలారు శ్రీనివాసరావు, అమరనేని వెంకటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ, వెంపటి రాజా, ఆళ్ల శ్రీనివాస్, చంద్ర ప్రసాద్, రాజేంద్రప్రసాద్, కంచర్ల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసనలో పాల్గొన్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

మధిర టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మధిర డిపో ఆర్టీసీ జేఏసీ నాయకులు అరుణకుమారి, రామచంద్రరావు విమర్శించారు. సోమవారం మధిరలోని ఆర్టీసీ డిపో గేటు వద్ద నిరసన తెలిపిన అనంతరం సమావేశంలో వారు మాట్లాడారు. జనవరి 27వతేదీ రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని, సమ్మె నోటీసుపై యాజమాన్యాలు నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని, సమస్యల పరిష్కారం కోసమే తాము పోరాడుతున్నామన్నారు. యాజమాన్యం సానుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే సమ్మె చేయటానికి వెనుకాడబోమన్నారు. జేఏసీ నాయకులు రామారావు, కిషోర్‌బాబు, మురళీకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు గ్రామంలో సోమవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవసంస్థ ఆధ్వర్యంలో 85మంది నిరుపేద విద్యార్థులకు ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలడుగు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమానియేల్, చైల్డ్ కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ మోదుగు వినోద్‌కుమార్, ప్రతినిధులు మురళీకృష్ణారెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

నేత్రదానం

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని ఐదోవార్డులో సోమవారం అనారోగ్యంతో మృతిచెందిన కాటేపల్లి సరస్వతీ నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. సరస్వతీ భర్త రామకృష్ణ, కుమారులు విజయ్, కిరణ్, కల్యాణ్‌లు లయన్స్‌క్లబ్ ప్రోత్సాహంతో ముందుకొచ్చి ఖమ్మం నేత్రనిధికి కళ్లు దానం చేశారు. సరస్వతీ మృతికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఆర్యవైశ్యసంఘం మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

విరాళం అందజేత



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు సోమవారం రూ.1,11,116విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కోటగిరి నరసింహారావు, సత్యవతి, మన్విత, వేదాన్షికలను ఆలయ కమిటీ సభ్యులు ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డిలను సన్మానించారు. దాతలు 94407 70314సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పుస్తకాల పంపిణీ

తల్లాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలోని జడ్పీఉన్నత పాఠశాలలో సోమవారం పది విద్యార్థులకు ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గైడ్లను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఎక్కువ ఉత్తీర్ణత సాధించి గ్రామానికి పేరుప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, అడపా అనిల్ పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైరా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 12న వేలంపాట నిర్వహిస్తామని వైరా ఎక్సైజ్ సీఐ జి.మమత తెలిపారు. ఖమ్మంజిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైరా ఎక్సైజ్ స్టేషన్‌లో 12వతేదీ ఉదయం 9.30గంటలకు ఈ వేలంపాట నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తిగల వారు వివరాల కోసం తనను సంప్రదించాలని సీఐ సూచించారు.

అధికారుల నియామకం

వేంసూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా జె.బాబ్జీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు బాబ్జీప్రసాద్ కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై వేంసూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు పనిచేసిన ఎం.ఎ.రాజు ఖమ్మం ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. అలాగే వేంసూరు ఎంపీడీవోగా పి.రాజారావు కూడా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఖమ్మం రూరల్‌లో రాజారావు ఎంపీవోగా పనిచేసి ఉద్యోగోన్నతిపై వేంసూరు ఎంపీడీవోగా నియమితులయ్యారు.

చింతకాని, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చింతకాని ఎంపీడీవోగా చుంచు శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈజీఎస్ క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న శ్రీనివాసరావును ఎంపీడీవోగా నియమించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రమాదేవి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఆర్థికసాయం అందజేత

సత్తుపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలోని కుక్కునూరు గ్రామంలోని 7వ తరగతి విద్యార్థినీ శెట్టిపల్లి హాసినికి సత్తుపల్లి పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ఉపాధ్యక్షుడు బోయినపల్లి రామారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని హాసిని తాతయ్య, నానమ్మల వద్ద ఉంటుందని, ఆర్థికంగా వెనుకబడిన ఆమె చదువును మధ్యలో నిలిపివేయకూడదనే సదుద్దేశ్యంతో తమంతా సేకరించిన నగదును అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కోటగిరి ఆనందగజపతిరావు, దామెర రమేష్, దామెర ప్రసాద్, రాఘవయ్య, సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చు

» జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌రెడ్డి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌రెడ్డి

బోనకల్, ఫిబ్రవరి 10: విద్యార్థులు ఇష్టపడి చదివితే నిర్దేశించిన లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చునని మధిర జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌రెడ్డి తెలిపారు. స్థానిక సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం న్యాయ చైతన్య అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను పాటించాలన్నారు. బాలికలకు ఫోక్సో చట్టం, గుడ్ అండ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. వంటగది, డైనింగ్‌హాల్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పద్మావతి, కోర్టు సిబ్బంది వెంకన్న, మల్లేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల డేటా ఎంట్రీ పరిశీలన



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్‌కార్డు దరఖాస్తుల డేటా ఎంట్రీ కార్యక్రమం చురుకుగా సాగుతుంది. ఈ మేరకు కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రేషన్‌కార్డుల దరఖాస్తుల డేటా ఎంట్రీ చేస్తున్న తీరును ఆర్డీవో రాజేంద్రగౌడ్ పరిశీలించారు. డేంటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు అర్‌ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి జాతర జెయింట్‌వీల్ వేలం

మధిర టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26వతేదీన మహాశివరాత్రి సందర్భంగా మధిర శివాలయం వద్ద జరుగనున్న జాతరలో ఏర్పాటుచేసే జెయింట్‌వీల్, ఇతర పిల్లల ఆటవస్తువులకు సోమవారం దేవాలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించారు. ఈవో జగన్మోహన్‌రావు, తహసీల్దార్ రాంబాబు, పలువురు అధికారుల సమక్షంలో ఈ వేలం నిర్వహించారు. మధిరకు చెందిన మొగిలి నర్సింహారావు రూ.23.70లక్షలకు వేలంపాట పాడి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను అమలు చేయాలి'

కారేపల్లి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకుడు భూక్యాశివనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల16న హైదరాబాద్‌లో ఓంకార్ భవనంలో జరిగే రాష్ట్రసదస్సులో నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యకక్రమంలో జరపల రాంసింగ్, అజ్మీరా అశోక్, సక్రు, హనుమా తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో లలిత సహస్ర పారాయణం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో భక్తిభావంతో సేవచేస్తూ మరోసారి మనమంతా ఒక్కటేనని నిరూపించారని ఆధ్యాత్మిక గురువు పేరి అరుణమాత అన్నారు. సోమవారం స్థానిక జ్ఞాన సరస్వతి దేవాలయంలో లలితా సహస్ర పారాయణం జరిపించారు. కార్యక్రమంలో లలిత పరివార్స్ రాజేశ్వరి, సీత, సుధా, ఇందిరా, లక్ష్మీ, ఆలయ కమిటీ సభ్యులు కొడిమెల అప్పారావు, రామప్ప, ఎంఎస్‌ఆర్.శర్మ, మల్లిఖార్జునరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కమ్మజాతి అభ్యున్నతికి పాటుపడాలి : మువ్వా



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న మువ్వా విజయబాబు

సత్తుపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కమ్మజాతి అభ్యున్నతికి పాటుపడుతూ అభివృద్ధి, సంక్షేమం కోసం సంఘం పనిచేయాలని టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. సోమవారం ఆయనను ఇటీవల నూతనంగా ఎన్నికైన కమ్మ సంఘం జిల్లా కమిటీ సభ్యులు తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు రఘు, చావా రాము, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, ఈసీ మెంబర్స్ తుమ్మలపల్లి నాగేశ్వరరావు, డాక్టర్ పోతినేని భీమేశ్వరరావులను శాలువాలతో మువ్వా ఘనంగా సన్మానించారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రవేటు, కార్పోరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటూ విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్ అన్నారు. సోమవారం సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల ఎదుట ఆందోళన చేశారు. పెండింగ్‌లోని స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల సమయంలో ఫీజులు చెల్లించలేదనే నెపంతో హాల్‌టిక్కెట్లను ఆపుతున్న యజామాన్యాలపై చర్యలు తీసుకోవాలని, సన్నబియ్యం ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం కంట్రోల్ బియ్యాన్ని పాలిష్ చేసి సరఫరా చేయడంతో విద్యార్థులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సపవట్ గాంధీ, ప్రభాస్, దిలీప్, భాష తదితరులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి: సీపీఎం



ముదిగొండలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ముదిగొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని మావోయిస్టులపై కేంద్రప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ముదిగొండలోని ఖమ్మం-కోదాడ రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మావోయిస్టులను ఎరివేస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం వారిని అరెస్టు చేయకుండా కాల్చిచంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు కోలేటి ఉపేందర్, మందరపు వెంకన్న, టీఎస్.కల్యాణ్, భద్రయ్య, అరుణ, ప్రభావతి పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

కారేపల్లి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మండల తహసీల్దార్ ఎన్.సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యాక్రమానికి హాజరుకాని వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ చింతా వేణు అన్నారు. వైరా మునిసిపాలిటీ 8వ వార్డులో జాతీయ ప్రధాన రహదారి పక్కనున్న ఓ అపార్టుమెంట్ ముందుభాగంలో నిలిచి ఉన్న మురుగునీటిని సిబ్బంది సోమవారం తొలగించారు. మునిసిపల్ కమిషనర్ ఈ మురుగునీటిని తొలగించే పనులను పర్యవేక్షించారు. మురుగునీరు తొలగించిన తర్వాత బ్లీచింగ్ ఇతర పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

వివిధ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వైరా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆదివారం జరిగిన జాతీయ, అంతర్జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వైరా విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రదర్శన కనపరిచి గోల్డ్‌మెడల్, సిల్వర్‌మెడల్ దక్కించుకున్నారు. కరాటే మాస్టర్ రఘు శిక్షణలో విద్యార్థులు పోటీలో రాణించి ప్రతిభ చాటుకొని ప్రశంసలందుకున్నారు.

ఏన్కూరు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీలలో ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రమ్యకృష్ణ ప్రతిభ చూపి ద్వితీయస్థానం సాధించింది. అండర్-13 విభాగంలో ప్రతిభచూపిన విద్యార్థినిని సోమవారం ఉపాధ్యాయులు అభినందించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం కూరాకుల సైదయ్య, కరాటే కోచ్ చల్ల మాధవి, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు రాంబాబు, పుల్లయ్య, శంకరరావు, కస్తూరి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు



వైరా: కరాటే పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సెమిస్టర్ ఫలితాలలో...

సత్తుపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూహెచ్ గత డిసెంబర్ నెలలో 2024-25విద్యా సంవత్సరానికి నిర్వహించిన బీటెక్ ద్వితీయ, మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో మండలంలోని మదర్‌థెరిస్సా అటానమస్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావులు అభినందనలు తెలిపారు.



తల్లాడ: విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



సత్తుపల్లి విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టాలెంట్‌టెస్టులో...

తల్లాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ఫిజిక్స్ టాలెంట్ టెస్టులో తల్లాడ మండలం పినపాక జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్.ఆసీఫ్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి టాలెంట్‌టెస్టుకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఆసీఫ్‌ను ప్రధానోపాధ్యాయుడు పి.నర్సింహారావు అభినందించారు.

మధిర టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మధిర టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖమ్మంలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ఫిజిక్స్ టాలెంట్ టెస్టులో తెలుగు, ఇంగ్లీష్‌మీడియం విభాగాల్లో మొదటిస్థానం సాధించారని ఎంఈవో వై.ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు సాయి, గౌతమ్, షేక్.సిరాజ్‌లు టాలెంట్‌టెస్టులో మొదటి స్థానం సాధించటం అభినందనీయమన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్

జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గోపినాథ్

మధిర టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యుడిగా మధిరకు చెందిన అంగడాల గోపినాథ్‌ను ఎంపిక చేశారు. ఖమ్మంలో జరిగిన జిల్లా యూనియన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో గోపినాథ్‌ను ఎంపిక చేసి ప్రకటించారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషిచేసిన జిల్లా యూనియన్‌కు గోపినాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

టీబీ రహిత మండలంగా తల్లాడ

తల్లాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత మండలంగా తల్లాడను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని సీహెచ్‌వో భాస్కర్ కోరారు. సోమవారం తల్లాడ మండలం అంబేద్కర్‌నగర్‌లో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ విభాగం సూపర్‌వైజర్‌లు సురేష్, సంజీవ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ, సునీత పాల్గొన్నారు.

భయాన్ని వీడి పరీక్షలు రాయాలి

తల్లాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలంటే భయపడకుండా రాయాలని అందుకు సన్నద్ధం కావాలని ఇన్‌ఫ్యాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ మోటివేటర్ ఎండీ.నవాబ్‌పాషా సూచించారు. సోమవారం తల్లాడ రైతువేదికలో విద్యాశాఖ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలనేవి జీవితంలో సర్వసాధారణమని, పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ధైర్యంగా పరీక్షలు రాయాలని కోరారు. జీవితంలో కూడా సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా వాటిని అధిగమించే విధంగా మనోధైర్యంతో ముం దుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్, విశ్రాంత జ్యూడిషీయల్ అధికారి వీడీఎస్. ప్రసాద్, సంపటం విజయలక్ష్మి, ఎండీ.ఆశా, మండల నోడల్ అధికారి పి.నర్సింహారావు పాల్గొన్నారు.